చిరుధాన్యాలతో అధిక పోషకాలు

బొంరాస్‌పేట్, మార్చి18 : బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో పోషణ వనిత కార్యక్రమం వాసన్ సంస్థ సహకారంతో నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు అంజిలయ్య, గోపాల్ తెలిపారు. రాగిలడ్డులు, రాగిపకొడి,అప్పడాలు,జావ,పాయాసం,సామ బియ్యం, కొర్రలు, ఆరికలు, సజ్జలు గురించి మహిళలకు చిరుధాన్యాలు వాటిలో ఉండే పోషకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంబుజ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల కోసం రూ.50వేలు అందజేత

పరిగి, మార్చి 18: పరిగి పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పరిగిలోని వెంకటేశ్వర హార్డ్‌వేర్ అసోసియేషన్ తరపున మంగళవారం రూ.50లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్ కుమార్‌లకు అసోసియేషన్ నాయకులు ఎ.శ్రీనివాసులు, ముకుందరెడ్డి అందజేశారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

దోమ, మార్చి 18: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తూ ఎనిమిది, తొమ్మిదవ తరగతులలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మంగళవారం హైదరాబాద్ నగర గ్రంథాలయంలో ముత్తూట్ ఫైనాన్స్ వారు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.అందులో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాల దోమ నుంచి ప్రేరణ,సంధ్య, బాలికల పాఠశాల నుంచి సరిత, సాదియా, కస్తూర్బా పాఠశాల నుంచి ప్రవళిక, పవిత్రలకు మెమొంటోలు, మూడు వేల రూపాయల చెక్కులను అందించారు. రాష్ట్ర గ్రంథాలయ సీఆర్డీహెచ్ మహేశ్‌బాబు, ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్స్, హెచ్ఎం శ్రీవిద్య, ఎస్వో చైతన్య, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

థర్డ్ పార్టీతో గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పర్యవేక్షణ

కొత్తగా పీఎంసీ ఏజెన్సీ నియామాకానికి హెచ్ఎండీఏ చర్యలు

సిటీబ్యూరో, మార్చి 18(నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డు నుంచి ఫోర్త్ సిటీని అనుసంధానం చేసేలా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ చర్యలు చేపట్టింది. రావిర్యాల నుంచి రీజనల్ రింగు రోడ్డు మీదుగా అమన్‌గల్ వరకు 41 కి.మీ. పొడువైన గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టు ప్రస్తుతం భూ సేకరణ సాగుతుండగా తాజాగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ బాధ్యతలను అప్పగించింది. థర్డ్ పార్టీ ఏజెన్సీ ఈ పనులను పర్యవేక్షించనుంది. డీపీఆర్ రూపకల్పన, ప్రాజెక్టు పర్యవేక్షణ వ్యవహారాలను ఈ ఏజెన్సీ చేతికి అప్పగించనుంది. అయితే హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటివరకు ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల నిర్మాణం చేయగా తొలిసారి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ బాధ్యతలను థర్డ్ పార్టీకి అప్పగించడంపై చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ప్రాజెక్టు విషయంలో ఇప్పటికే భూసేకరణ వివాదస్పదమైన నేపథ్యంలో 30 నెలల పాటు ప్రాజెక్టు పర్యవేక్షణపై బాధ్యతలను ఆ ఏజెన్సీకి హెచ్ఎండీఏ కట్టబెట్టనుంది.

ఓయూ హాస్టల్‌లో కూలిన పైకప్పు..
విద్యార్థికి స్వల్ప గాయాలు

ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో టెక్నాలజీ హాస్టల్లో కూలిన పైకప్పు)

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 18 : ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ హాస్టల్‌లో బాత్రూంలో పైకప్పు కూలడంతో ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటనపై ఆందోళన చెందిన విద్యార్థులు ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు భారీగా బలగాలని మోహరించి ప్రధాన రహదారిని మూసివేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పైకప్పు పెచ్చులు ఊడిపడటం తమకు సాధారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి తలపైనైనా ఆ పెచ్చులు పడితే అప్పుడు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉండాలన్నా, బాత్రూంకి వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా తమ హాస్టల్ ని మూసివేసి వేరే దగ్గర తమకు హాస్టల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న హాస్టల్‌లో తమకు గదులు కేటాయించాలని కోరారు. ఇలాంటి సమస్యలు ఉన్నా ఆందోళనలు చేయకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల అధికారులు విద్యార్థుల వద్దకు వచ్చి చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. తమకు నూతన హాస్టల్ ఎప్పుడు కేటాయిస్తారో స్పష్టమైన తేదీని ప్రకటించాలని విద్యార్థులు కోరడంతో.. అధికారులు నిస్సహాయత వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు తమ ఆందోళనలను కొనసాగించారు. చివరికి బుధవారం వీసీతో విద్యార్థులకు మాట్లాడే అవకాశం కల్పించడంతోపాటు శాశ్వత పరిష్కారం లభించేలా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్..నగదు స్వాధీనం

పరిగి, మార్చి 18: పేకాట ఆడుతున్న అయి దుగురిని పరిగి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివ రాల ప్రకారం సోమవారం రాత్రి పరిగి పట్ట ణంలోని ముబారక్ వెల్డింగ్‌షాపు వెనకాల డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు వెళ్లగా వారిని పట్టుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేయడంతోపాటు వారి వద్ద నుంచి రూ.9320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'పది' విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

కులకచర్ల, మార్చి 18 :మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామ జడ్పీ ఉన్నత పాఠ శాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం వీడ్కోల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌కలాన్ గ్రామంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని ప్రధానోపా ధ్యాయుడు బసిరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షాప్యాడ్స్, పెన్నులు, కంపాక్స్ బాక్స్‌లను యువజన సంఘం సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు .శ్రీకాంత్ రెడ్డి, బలరామ్ రెడ్డి, బాల్ రాజ్, శ్రీనివాస్ లను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బలవర్ధన్ రెడ్డి, రాజ్‌మహ్మద్, ఉపాధ్యాయులు మల్లేశం, రాంచంద్రయ్య, పావని, జాస్సెన్, చంద్రారెడ్డి, వెంకటయ్య ఉన్నారు.

బొంరాస్‌పేట్: దుద్యాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో విజయ రామరావు తెలిపారు. . కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, విజయ్‌కుమార్, అభయ్ కుమార్, సుధాకర్‌రావు, రాములు, ముకుందరెడ్డి, రవినాయక్, రమేశ్, సాలిబాయి, మాధవి, నవీన పాల్గొన్నారు.

కులకచర్ల సాల్వీడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

ధారూరు: మోమిన్‌కలాన్ గ్రామ పాఠశాలలలో..

బొంరాస్‌పేట: దుద్యాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో...

డ్రగ్స్‌ను నిర్మూలించాలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, మార్చి 18(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిపై సీరియస్‌గా ఉందని, డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎక్సైజ్ శాఖ భవనంలో హైదరాబాద్ డివిజన్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు ఆయన క్యాష్ రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసుల నిందితులపై కఠినంగా వ్యవహరించాలని, వారికి తాగునీటితో పాటు సంక్షేమ పథకాలు కూడా నిలిపివేయాలని సీఎం ఆదేశించారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు గుర్తించాలన్నారు. హైదరాబాద్‌లో ఎక్కువగా డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ ఫెయిడ్ లిక్కర్, ప్యూరియస్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాలకు నెలవుగా ఉందని, ఈ విషయంలో ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, ఎస్‌టీఎఫ్ టీమ్‌లు, డీటీఎఫ్ టీమ్‌లు గుర్తించి సమన్వయంతో, సమయస్ఫూర్తితో వాటిని కట్టడి చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. నార్కోటిక్, పోలీసు, ఇతర ఏజెన్సీలకు దీటుగా ఎక్సైజ్ శాఖ పనిచేయాలని, మన పనితీరే మన డిపార్టుమెంట్‌కు పేరు తెచ్చి పెడుతుందనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఎక్సైజ్ శాఖ యంత్రాంగం సామాజిక బాధ్యతతో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై కదం తొక్కాలని, అందరికంటే మనమే ముందు ఉండేలా చూడాలన్నారు. హైదరాబాద్ డివిజన్‌లో 16 కేసుల్లో 41 మందికి డైరెక్టర్ క్యాష్ రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈఎస్‌లు శ్రీనివాసరావు, స్మితా సౌజన్యలతో పాటు సీఐలు జగన్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, కోటమ్మ, శిరీష, మహేశ్ పాల్గొన్నారు.

వృత్తిని ప్రేమించి, బాధ్యతగా పని చేయండి

ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ ఎన్.ఏ.అజయ్ రావు

సిటీబ్యూరో, మార్చి18, (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్ శాఖలో మహిళా కానిస్టేబుళ్లుగా శిక్షణ పూర్తి చేసుకున్నవారు వృత్తిని ప్రేమిస్తూ.. బాధ్యతగా పని చేయాలని ఎక్సైజ్ శాఖ అకాడమీ డైరెక్టర్ ఎన్.ఏ.అజయ్‌రావు అన్నారు. మంగళవారం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా కానిస్టేబుళ్లతో ఫాస్టింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పరీక్షలు, పీటీ, శిక్షణ, అవుట్ డోర్ శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి ఎన్.ఏ.అజయ్ రావు ధ్రువపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాడమీ జాయింట్ డైరెక్టర్ సి. వి. శశిధర్‌రెడ్డి, అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ మోహన్‌బాబు, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ఎస్ టీ ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సైబరాబాద్ పరిధిలో 163 సెక్షన్ అమలు

సిటీబ్యూరో, మార్చి18(నమస్తే తెలంగాణ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మార్చి 21 ఉదయం 6 గంటల నుంచి ఏప్రిల్ 4 సాయంత్రం 6 గంటల వరకు 163(బీఎన్ఎస్) సెక్షన్ అమలులో ఉంటుందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల సమయంలో, పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమికూడవద్దన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఉన్న ఫొటోకాపీ (జిరాక్స్) సెంటర్లు, ఇంటర్నెట్ కేంద్రాలు మూసేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించినపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫొటోలు మార్ఫింగ్.. యువతికి బెదిరింపులు

వెంగళరావునగర్, మార్చి 18 : పోలీసు కానిస్టేబుల్ నని చెప్పి యువతితో చెలిమి చేశాడు.. పార్క్ లో పరిచయం కాస్తా కాఫీ షాప్ వరకు సాగింది. బీటెక్ చదివే యువతిని మాయమాటలతో బోల్తా కొట్టించి.. యువతి ఫోన్ లోని కాంటాక్ట్స్ అన్నీ తన ఫోన్ లోకి ఫార్వార్డ్ చేసుకున్నాడు. తాను చెప్పినట్టు వినకుంటే యువతి ఫొటోల్ని, వీడియోల్ని మార్ఫింగ్ చేసి చెడుగా ప్రచారం చేస్తానని భయాందోళనకు గురి చేశాడు. భయపడిపోయిన ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్.ఆర్.నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి కథనం ప్రకారం... ఎస్.ఆర్.నగర్ కు చెందిన యువతి(20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నది. ఏడాది కిందట నెక్లెస్ రోడ్డులోని లేక్ వ్యూ పార్క్ కు వెళ్లినప్పుడు అక్కడ తేమలి పుజారా రమేశ్ (24) అనే వ్యక్తి తాను పోలీసు కానిస్టేబుల్ నని యువతితో పరిచయం చేసుకున్నాడు. ఫోన్ నంబర్ తీసుకుని ఫోన్లు చేస్తూ.. మెసేజ్‌లు పంపి యువతితో స్నేహాన్ని పెంచుకున్నాడు. మంచి వ్యక్తని ఆమె నమ్మింది. ఓ రోజు ఎస్.ఆర్.నగర్ లోని కాఫీ షాప్ లో కలిసినప్పుడు ఆమె ఫోన్ లోని కాంటాక్ట్స్ అన్నీ తన ఫోన్ కు ఫార్వార్డ్ చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఆమెని బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. తాను చెప్పినట్టు వినకపోతే నీ ఫొటోల్ని, వీడియోల్ని మార్ఫింగ్ చేసి కాంటాక్ట్స్ అందరికీ పంపుతానని బెదిరించాడు. భయపడిపోయిన ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హరీశ్వర్‌రెడ్డి జయంతి వేడుకలు



పరిగి, మార్చి 18 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. పరిగిలోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, తల్లి గిరిజాదేవితో కలిసి కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం కేక్‌ను తల్లి గిరిజాదేవికి తినిపిం చారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలపాటు పరిగి రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన హరీశ్వర్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి-ప్రతిమారెడ్డి దంపతులు, కొప్పుల అనిల్‌రెడ్డి-శ్రీదీప్తి దంపతులు, హరీశ్వర్‌రెడ్డి కూతురు అర్చన, కుటుంబసభ్యులు, వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో విద్యార్థుల ప్రతిభ బహిర్గతం

ధారూరు, మార్చి 18: మండల పరిధిలోని తరిగోపుల కాంప్లెక్స్ పరిధిలోని పది పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానలో అంపల్లి ప్రాథమిక పాఠశాల, ద్వితీయ స్థానంలో పులిచింతల మడుగు తండా, తృతీయ స్థానంలో ఊరిముందలి తండా ప్రాథమిక పాఠశాల నిలిచాయి. ఈ సందర్భంగా తరిగోపుల కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు మాట్లాడుతూ శిక్షణ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న క్విజ్ పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో సంయోదిన్, ఆర్పీ సత్యనారాయణ, చిరంజీవి, మల్లేశ్, రాజేందర్, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్, మార్చి18: బొంరాస్‌పేట్ మండలం దుప్‌చర్ల గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను ఆర్ఐ శిరీష మంగళవారం బహిరంగ వేలంపాటను నిర్వహించారు.15 ట్రాక్టర్ల ఇసుకను రూ. 29వేల ఐదు వందలకు శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేశాడు.

బొంరాస్‌పేట్, మార్చి18: మండల పరిధిలోని బాపల్లితండాలో మోతిబాయా భర్త సేవ్యా నాయక్‌కు రూ. 50వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ సర్పంచ్ మోత్యానాయక్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మహేందర్‌సింగ్, హన్మ్యానాయక్, దాస్య, బిమ్లీ, శివరామ్, గాంగ్య, బాల్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై గ్రామసభ..

కొత్తూరు, మార్చి 18: రైతులకు నష్టహారం అందించిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకుంటామని ఆర్డీవో సరిత అన్నారు. కొత్తూరు మండలంలోని పెంజర్లలో భూ సేకరణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 2022లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబర్ 389లో మొత్తం 112 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిం దని చెప్పారు. అందులో భాగంగా రైతులకు ఇచ్చే పరిహారంపై గ్రామసభ నిర్వహించి చర్చించామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ సంజీవ, సీఐ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

34 తులాల బంగారం, నగదు చోరీ

బంజారాహిల్స్, మార్చి 18: షేక్‌పేట సమీపంలోని డైమండ్ హి ల్స్ కాలనీలో నివాసముంటున్న వ్యాపారి ముజాహిద్ కుటుంబసభ్యులు వేరే ఊరికి వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో ము జాహిద్ ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి తిరిగి మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చేసరికి ఇంటి వెనుక తలుపు పగులగొట్ట కనిపించింది. దీంతో ఆందోళన గురైన ముజాహిద్ లోనికి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి. రెండు బెడ్రూంలోని తాళాలు పగులగొట్టిన దుండగులు 34 తులాల బంగారు ఆభరణాలతో పాటు సుమారు రూ.4.5 లక్షల నగదు, కొంత విదేశీ కరెన్సీ ఎత్తుకెళ్లారు. చోరీ చేసేందుకు ముందు ఇంట్లోని సీసీ కెమెరాలు.. డీవీఆర్ ధ్వంసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఫిర్యా దు అందుకున్న ఫిలింనగర్ పోలీసులు క్లూస్ టీమ్ సాయంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సమీపంలోని సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు.

వాహనదారులూ.. నంబర్‌ప్లేట్లతో జరభద్రం

- అంకెలు, అక్షరాల్లో మార్పులు చేయొద్దు
- ఎంవీ యాక్ట్ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్స్ ఉండాల్సిందే..
- ఆర్టీఏ అధికారుల ప్రత్యేక తనిఖీలు
- గ్రేటర్‌లో 27 వాహనాలు సీజ్

సిటీబ్యూరో, మార్చి 18(నమస్తే తెలంగాణ): వాహనదారులూ.. నంబర్ ప్లేట్స్‌తో జరభద్రం. ఇష్టమొచ్చినట్టుగా నంబర్లను రాసుకుంటే ఆర్టీఏ అధికారులకు దొరికినట్టే. జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ కూడా చేసే ప్రమాదం ఉన్నది. ఇటీవల కాలంలో చాలా మంది తమ వాహనాల నంబర్ ప్లేట్లపై ఇంగ్లిష్ అక్షరాలను పోలి ఉన్న అంకెలను అమర్చుకుంటున్నారు. మరికొందరు నంబర్‌లో ఒక అంకెను చెదరగొట్టి వాహనాలను తిప్పుతున్నారు. ఇంకొందరు ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు వాహనాలను నడుపుతున్నారు. ఇతర రాష్ట్ర వాహనాలు సైతం అనుమతి లేకున్నా ఇక్కడి నంబర్ ప్లేట్స్ తగిలించుకుని రాష్ట్రంలో తిప్పుతున్నారు. ముఖ్యంగా వీకెండ్‌లు, పండుగల రద్దీ దృష్ట్యా వైట్ నంబర్ ప్లేట్ ఉన్న వాహనాలు ప్రయాణికులను ఎక్కించుకుని ట్రిప్పులు కొడుతున్నాయి. అందులో భాగంగా రవాణా శాఖాధికారులు ప్రత్యేక బృందాలుగా తనిఖీల ప్రక్రియను ముమ్మరం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ట్రావెల్స్ బస్సులపై సైతం నిఘా పెట్టి వాహనాలను సీజ్ చేస్తున్నారు. ఇటీవల తనిఖీల్లో 27 వాహనాలను రవాణా శాఖాధికారులు సీజ్ చేశారు. ఎంవీ యాక్ట్ 1989 ప్రకారం.. ఎంవీ యాక్ట్ 50, 51 నిబంధనల ప్రకారం.. ద్విచక్ర వాహనాలు, లైట్ మోటార్ వెహికిల్ కార్లు రిజిస్ట్రేషన్ అంకెలు, అక్షరాలు కచ్చితంగా వైట్ ప్లేట్‌పై బ్లాక్ కలర్‌లో ఉండాలి. కమర్షియల్ వాహనాలైతే యెల్లో ప్లేట్‌పై బ్లాక్ లెటర్స్‌తో నంబర్ ఉండాలి. రిజిస్ట్రేషన్ నంబర్ రెండు వరుసల్లో ఉండాలి.స్టేట్ కోడ్ (టీజీ) అండ్ రిజిస్ట్రేషన్ అథారిటీ కోడ్ తర్వాత మిగిలిన నంబర్ రెండో వరుసలో ఉండాలి. హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేస్తే వెహికిల్ వివరాలతో పాటు ఓనర్ డిటెయిల్స్ మొత్తం తెలుస్తాయని అధికారులు చెబుతున్నారు. వాహనాలు దొంగతనం జరిగినా.. ప్రమాదానికి గురైనా వెంటనే వివరాలు తెలుసుకోవచ్చు.

ట్రావెల్స్ మాయాజాలం!

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా రవాణా అధికారుల బృందాలు పలు ప్రాంతాల్లో నిఘా వేసి వాహనాలను తనిఖీ చేశారు. ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి.. రూల్స్‌కు వ్యతిరేకంగా నడుస్తున్న బస్సులను సీజ్ చేశారు. ఫిట్‌నెస్(వాహనసామర్థ్యం), టాక్సీ, లైసెన్స్, బీమా, ఫైర్ సేఫ్టీ, ఓవర్ స్పీడ్, పరిమితికి మించి లోడ్, హారన్ మోత, ఫస్ట్ ఎయిడ్ కిట్ తదితర వాటిని చెక్ చేశారు. కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఫైర్ సేఫ్టీ సరిగా పాటించడం లేదని అధికారులు గుర్తించారు.

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి..

తనిఖీలు ముమ్మరం చేశాం. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాల రాకపోకలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. అతివేగంతో డ్రైవింగ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. హెల్మెట్ ధరించడం, కారు సీటు బెల్ట్ ధరించడం, రోడ్డు నిబంధనలు పాటించాలి. వేగ సూచికలకు అనుగుణంగా వెళ్లాలి. నంబర్ ప్లేట్స్ ట్యాంపరింగ్ చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేస్తాం.

– రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్